

మెడికో లీగల్ కేసుల్లో ఇబ్బందులు

చీరాల రూరల్: ఇరు వర్గాలకు చెందిన కొందరు కొట్లాడుకుని చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలలో చేరుతారు. కానీ వారు వైద్య చికిత్సలు చేయించుకునేందుకు ఇష్టపడకుండా కేవలం ఎదుటివారిపై కేసులు పెట్టేందుకు మాత్రమే చేరుతుంటారు. అటువంటి సమయాల్లో పేషంట్ల తాలూకు వారి బంధువులతో పెద్ద ఇబ్బందులు వస్తుంటాయి. పెద్దగా గాయాలు లేకపోయినా కేసులు పెట్టేందుకు ట్రీట్‌మెంట్ చేయాలని వైద్యులపై ఒత్తిడి చేస్తుంటారు. అటువంటి సమయాల్లో తప్పని సరిగా వైద్యశాలలో పోలీసులు ఉండాలి. కొందరు వైద్యశాలలోనే కొట్లాడుకున్న సందర్భాలున్నాయి.

– **డాక్టర్ పులిపాటి దినేష్**, ప్రాంతీయ ప్రభుత్వ వైద్యశాల, చీరాల



పోలీసులు రోజూ వచ్చి చూడాలి

చీరాల రూరల్: ప్రభుత్వ వైద్యశాలల్లో రోగులను చూసేందుకు ఎవరుపడితే వారు లోపలికి వస్తున్నారు. కొందరు మద్యం సేవించి వస్తున్నారు. అలా కాకుండా రోగులకు సంబంధించిన వారికి ఒక సమయాన్ని కేటాయించి విజిటింగ్ పాస్‌లు ఏర్పాటు చేసి అమలు చేస్తే ఎవరుపడితే వారు వైద్యశాలలోకి రాకుండా ఉంటారు. రాత్రి డ్యూటీలు చేసే సమయాల్లో సెక్యూరిటీ గార్డుల సంఖ్యను పెంచాలి. ప్రతిరోజూ పోలీసులు వచ్చి వైద్యశాలను పరిశీలన చేస్తూ ఉండాలి. వైద్యశాలపై నిత్యం పోలీసుల నిఘా ఏర్పాటు చేయాలి.

– **కేపీఎస్ కుమారి**, హెడ్ నర్స్, ప్రభుత్వ వైద్యశాల, చీరాల



క్లుప్తంగా

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

చీరాల టౌన్: గ్రామీణ ప్రాంతాల్లోని వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యులు శ్రీదేవి సూచించారు. బుధవారం మండలంలోని ఈపూరుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. శ్రీదేవి మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలోని 14 సబ్ సెంటర్లలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. గ్రామాల్లోని చిన్నపిల్లలు, వృద్ధులు అనారోగ్యాలకు గురికాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. చిన్నపిల్లలకు, గర్భిణులకు అందించే వ్యాక్సిన్లను క్రమం తప్పకుండా వేయాలన్నారు. ప్రజలకు కావాల్సిన అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటుగా వేడిగా ఉన్న ఆహార పదార్థాలు తినాలని, నిల్వ ఉన్న ఆహారాన్ని తినవద్దన్నారు. పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

పొదుపు రుణాలు సకాలంలో చెల్లించాలి

చీరాల టౌన్: పొదుపు గ్రూపులు రుణాల సకాలంలో చెల్లించేలా వీఓఏలు చర్యలు తీసుకోవాలని ఏపీఎం సుబ్బారావు సూచించారు. బుధవారం బుర్లవారిపాలెంలోని స్త్రీశక్తి భవన్‌లో మండలంలోని వీఓఏలకు ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఉన్న పొదుపు గ్రూపుల వద్దకు వీఓఏలు నెలకు ఒకసారి సమావేశాన్ని నిర్వహించి గ్రూపుల ప్రగతిని తెలుసుకోవాలన్నారు. పొదుపు గ్రూపులు తీసుకున్న రుణాలు, ఏర్పాటు చేసుకున్న స్వయం సహాయక సంస్థలు, వ్యాపారాలను వీఓఏలు పరిశీలించి పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ సంఘాల పుస్తకాలను విధిగా రాయడంతో పాటు సీఐఎఫ్, స్త్రీనిధి, సబ్‌ప్లాన్ రుణాలన్నీ వంద శాతం సక్రమంగా చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రుణం వాయిదాలు పూర్తి అయిన గ్రూపులకు అదనపు మొత్తంతో రుణం అందించాలని తెలిపారు. వీఓఏలు పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. సమావేశంలో సీసీలు, వీఏవోలు ఉన్నారు.

శింగరకొండ దర్శిని




ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం శ్రావణ మాసం ఆరుద్ర నక్షత్రం ఏకాదశి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర బుధవారం తెలిపారు. బిందె తీర్థం, పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

హెచ్‌ఐవీ నియంత్రణకు కృషి చేయాలి

అద్దంకి రూరల్: ఎయిడ్స్ నియంత్రణకు అంతా కృషి చేయాలని అద్దంకి ఎస్సై సీహెచ్ ప్రవీణ అన్నారు. మంగళవారం స్థానిక ప్రకాశం జూనియర్ కళాశాలలో బాపట్ల జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎయిడ్స్ నియంత్రణకు ప్రభుత్వం, స్వచ్ఛంద సేవా సంస్థలు అందించే వైద్య సేవలు సద్వినియోగపరుచుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, ఫిజికల్ డైరెక్టర్ డేవిడ్ రాజు, బీవీ సాగర్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

250 మందికి వైద్య చికిత్స



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చినగంజాం: మండల కేంద్రంలో కిమ్స్ వైద్యశాల ఆధ్వర్యంలో 250 మందికి బుధవారం ఉచిత వైద్యచికిత్సలు అందజేశారు. చినగంజాంలోని హనీ మెడికల్స్, శ్రీనివాస క్లినిక్ సహకారంతో స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందించడంతో పాటు ఉచితంగా మందులు అందజేశారు. శిబిరంలో ఈసీజీ, బీపీ, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించారు. గుండె, కిడ్నీ, విషజ్వరాలకు సంబంధించి ప్రజలకు అవగాహన కలగజేశారు. రోగ నిర్ధారణ జరిగిన 80 మంది రోగులను ఒంగోలు కిమ్స్ వైద్యశాలకు మెరుగైన చికిత్స నిమిత్తం హాజరు కావాల్సిందిగా సూచించారు. ఆరోగ్యశ్రీ, ఈహెచ్‌ఎస్, ఈసీహెచ్‌ఎస్ కార్డుల ద్వారా కార్పొరేట్ వైద్యం అందించనున్నట్లు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రఫి తెలిపారు. డాక్టర్ రామాంజనేయులు, డాక్టర్ లత, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కళ తప్పిన సాగు



ఎండిపోయిన జొన్న మేత



మేఘావృతమై ఉన్న ఆకాశం

- వర్షాలు లేక ఎండుతున్న పంటలు
- పశువుల మేతకు తిప్పలు
- ప్రశ్నార్థకంగా 10 వేల ఎకరాల్లో మెట్ట సాగు

అద్దంకి: ఈ సంవత్సరం వరుణుడు అదునులో కరుణించడలేదు. దీంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పడిన కొద్ది పాటి వర్షాలకు దుక్కిదున్నిన భూముల్లో రైతులు కంది, మొక్కజొన్న, జూట్, పశుగ్రాస పైర్లను సాగు చేశారు. ఆలా సుమారు పదివేల ఎకరాలు సాగులోకి రాగా.. ఆయా పంటలు ప్రస్తుతం 25 నుంచి 30 రోజుల యవసులో ఉన్నాయి.

కరుణించని వరుణుడు

సాగు చేసిన తరువాత ఒకటి రెండు దఫాలు వరుణుడు జాలి చూపడంతో పడిన ముసురు జల్లులకు ఆయా పంటు బతికి బట్ట కట్టాయి. ఇదిలా ఉంటే దాదాపు ఇరవై రోజుల నుంచి ఆకాశం మేఘావృతం అవుతుందే కానీ వర్షం కురిసిన దాఖలాలు లేవు. దీంతో కంది, పాశుగ్రాసం పైర్లు ఎండిపోతున్నాయి. మొక్కజొన్న పంట వాడుముఖం పట్టింది. అయితే మొక్కజొన్న సాగు చేసిన రైతులు పైరు ఎండి పోకుండా రసాయన ఎరువులను ఆశ్రయించి ఆ పంటకు గుక్క తడుపుతున్నారు. పశువులకు మేత కోసం సాగు చేసి ఇంగ్లిషు గడ్డి, జొన్న పంటలు నిలువునా ఎండిపోయాయి. ఎక్కడ చూసినా తెల్లగా ఎండిపోయిన పగుగ్రాసమే తప్ప, పచ్చగా ఉన్న పశుగ్రాసం పైర్లు కనిపించడం లేదు. బోర్ల కింద సాగు చేసిన గ్రాసం మాత్రమే కొంత ఆశాజనకంగా ఉంది. దాంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ సంవత్సరం పంటలకు శని చట్టుకుందని, ప్రతి సంవత్సరం వర్షాలు బాగా పడి పంటలు కళకళలాడేవని ఇప్పుడు ఆ పరిస్థితి లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా వరుణుడు కరుణిస్తేనే పంటలు జీవంతో ఉంటాయని, మరో పది రోజులు ఇదే పరిస్థితి కొనసాగితే మెట్ట పైర్లపైన ఆశ వదులుకోవాల్సిందేనని రైతులు ఆవేదన చెందుతున్నారు.



వాడు ముఖం పట్టిన మొక్కజొన్న

ఆలోచనా దృక్పథంతో ముందడుగు

అద్దంకి: ప్రతి విద్యార్థి ప్రతి విషయాన్ని గుడ్డిగా నమ్మకుండా ఆలోచనా దృక్పథంతో పరిశీలించి తెలుసుకోవాలని న్యాయవాది ఎండీ రఫీ అన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు బుధవారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కాకానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్రాథమిక హక్కులు, విధుల గురించి న్యాయవాదులు షేక్ మహమ్మద్ రఫీ, టి. అనూష, గరికపాటి ఉదయ శంకర్, విద్యార్థులకు అవగాహన కల్పించారు. వివాహ వయస్సు వచ్చే వరకు వివాహం చేసుకోవద్దని చెప్పారు. బాల్య వివాహాలు చేసుకోవడం, చేయించడం నేరమన్నారు. ప్రధానోపాధ్యాయులు గురవయ్య, పాలడుగు నాగేశ్వరరావు జాగర్లమూడి విష్ణు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయవాది ఎండీ రఫీ

మత్తుపానీయాలతో జీవితం చిత్తు

వేటపాలెం: మత్తుపానీయాలు సేవించడం ద్వారా అనేక అనర్థాలు చోటు చేసుకుంటాయని ఎస్సై ఎం. వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్థానిక బండ్ల బాపయ్య హిందూ జూనియర్ కళాశాలలో మత్తు పానీయాలపై విద్యార్థులకు అవగాహన సమావేశం బుధవారం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ కొంత మంది చిన్నతనం లోనే మత్తుపానీయాలకు అలవాటు పడి వారి జీవితాలు నాశనం చేసుకుంటున్నారని గుర్తుచేశారు. వాటిని సేవించి అనేక మంది యువకులు నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. యువకులు వారి జీవితాలతో పాటు వారి కుటుంబాల బజారున పడతాయని సూచించారు. చదువుకొనే వయస్సులో చదువు పై దృష్టి సారించి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఏఎస్సై సాల్మన్ రాజు, ప్రిన్సిపాల్ పి. బాల సుబ్రహమ్మణ్యం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై వెంకటేశ్వర్లు

గురుకుల విద్యార్థినుల ప్రతిభ

అద్దంకి: జిల్లా స్థాయిలో బాపట్లలో నిర్వహించిన పోటీల్లో అద్దంకికి చెందిన విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈ పోటీలను వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలను జిల్లా స్థాయిలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో బుధవారం బాపట్ల జూనియర్ కళాశాలలో నిర్వహించారు. వక్తృత్వ పోటీలో డాక్టర్ బార్ అంబేడ్కర్ గురుకులానికి చెందిన 10వ తరగతి విద్యార్థినులు వి. లక్ష్మి , యం. లావణ్య టి.ఖ్యాతి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. వీరు రాష్ట్రస్థాయి పోటీలకు హాజరౌతారు. ఈ పోటీలను సమగ్ర శిక్ష అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీ బి. మోజెస్.. జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాధిక్ నిర్వహించారు. పోటీలకు జీసీడీఓ శ్రీమతి ఎం. చారులత.. ఐఈడీ కోఆర్డినేటర్ ఏం.జ్యోత్స్న న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. సమగ్ర శిక్ష బాపట్ల జిల్లా ఏపీసీ.. డిప్యూటీ కలెక్టర్ శ్రీమతి పీహెచ్ లక్ష్మీ కుమారి విద్యాశాఖ అధికారి జి. వెంకటేశ్వర్లు అభినందించినారు.



వి. లక్ష్మి



యం. లావణ్య



టి. ఖ్యాతి

చిరు ఉద్యోగులపై ప్రతాపమా?

- పాలనలో మార్పు తీసుకురండి
- ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ చేర్చండి
- సీపీఎం నాయకురాలు రమాదేవి హితవు

జె.పంగులూరు: తెలుగు దేశం పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చి సూర్ సిక్స్ హామీలు నమ్మి అధికారం కట్టబెడితే.. ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిన అధికార పార్టీ చిరు ఉద్యోగులపై ప్రతాపం చూపించడం సరైన పద్ధతి కాదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు డి.రామాదేవి అన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా చిరు ఉద్యోగులను రాజకీయ నాయకులు వేధింపులకు గురిచేయడం, ఉన్న కొద్దిపాటి ఉపాధి అవకాశాలను లేకుండా చేయటం సరైనది కాదని, ఆ అవకాశం ఉంటే వారికి ఇంకా మేలు జరిగేటట్టు చూడాలని హితవు పలికారు. సీపీఎం మండల కమిటీ సమావేశం బుధవారం పంగులూరులో గుడిపాటి మల్లారెడ్డి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి. రమాదేవి మాట్లాడుతూ అధికారంలో ఉన్న తెలుగు దేశం పార్టీ నాయకులు గ్రామాల్లో చిరు ఉద్యోగులను తొలగించాలనే ప్రయత్నంలో ఉన్నారని, ఈ పాటికే కొంత మందిని తొలగించారన్నారు. ప్రస్తుతం వ్యవసాయం 70 శాతం కౌలు రైతుల చేతుల్లోకి వెళ్ళిపోయిందన్నారు. అలాంటి కౌలు రైతులకు ప్రభుత్వం అండదండలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం కౌలు చేసే ప్రతి రైతులను గుర్తించి, వారికి గుర్తింపు కార్డులు ఇచ్చి అనేక రాయితీలను సమకూరుస్తున్నామని చెప్పినప్పటికీ అచరణలో అవి అమలు జరగటం లేదని విమర్శించారు. అధికారులు అనేక అడ్డంకులు సృష్టించి కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వడం లేదని తెలిపారు. పంగులూరు ప్రాంతంలో ఎక్కువ శాతం రబీ సీజన్లో వ్యవసాయం ప్రారంభిస్తారు. అప్పటికి కౌలు రైతులందరికీ కౌలు గుర్తింపు కార్డులు ఇచ్చి వారి పేరుతో ఈ క్రాప్ నమోదు చేయాలని రమాదేవి కోరారు.

ఉచితం అంటే ఎక్కువ ధరా?

తాము అధికారంలోకి వస్తే ఉచిత ఇసుకు పాలసీని అమలు చేస్తామని చెప్పిన తెలుగు దేశం పార్టీ నాయకులు అధికారంలోకి వచ్చిన అనంతరం ఇసుక విషయంలో ఎలాంటి మార్పులు చేయలేదని, గతం కంటే ఇప్పుడు ఇసుక ధర భారీగా పెరిగిందని సీపీఎం రాష్ట్ర నాయకురాలు రమాదేవి విమర్శించారు. వైఎస్సార్ సీపీ పాలనలో ట్రక్కు ఇసుక రూ. 4 వేలు కాగా, ప్రస్తుతం ఇప్పుడు అదే ఇసుక ట్రక్కు రూ. 6 వేలు పలుకుతుందని తెలిపారు. గతంలో ఇసుక ధరలు చేసి గగ్గోలు పెట్టిన తమ పాలనలో ఉచిత ఇసుక ఇస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇతర నాయకులు ప్రజలకు హామీలు ఇచ్చారన్నారు. ప్రస్తుతం ఉచిత ఇసుక హామీ అమలు కావడం లేదని ఎద్దేవా చేశారు. సీపీఎం జిల్లా నాయకులు రాయిని వినోద్ బాబు, మండల కార్యదర్శి తలపనేని రామారావు, సభ్యులురాయిణి కృష్ణకుమారి, గుడిపాటి మల్లా రెడ్డి, సుబ్బరాజు. పి ఏలియా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమాదేవి

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



జొన్న తాళి ప్రభుత్వ పాఠశాలలో నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న దాత వెంకటేశ్వర్లు

మార్టూరు: మండలంలోని జొన్న తాళి గ్రామ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బుధవారం ఓదాత నోటి పుస్తకాలు పంపిణీ చేశారు. పర్చూరు మండలం నూతలపాడు గ్రామానికి చెందిన నిరక్షరాస్యుడైన వయోవృద్ధుడు చిమటా వెంకటేశ్వర్లు గత రెండు దశాబ్దాలుగా పాఠశాల విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా బుధవారం జొన్నతాళి యూపీ పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలను దాత పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

పర్చూరు ఎస్ఐగా మాల్యాద్రి

పర్చూరు (చినగంజాం): పర్చూరు ఎస్ఐగా జె. మాల్యాద్రి నియమితులయ్యారు. నెల్లూరు జిల్లా నుంచి బదిలీపై వచ్చిన ఆయన బుధవారం పర్చూరు ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. పర్చూరులో ఎటువంటి అలజడులు చోటు చేసుకోకుండా శాంతి భద్రతలను కాపాడేందుకు కృషి చేస్తానన్నారు. నూతనంగా బాధ్యతలను స్వీకరించిన ఆయనకు పోలీస్ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. గతంలో పనిచేసిన ఎస్ఐ రమేష్ బదిలీపై చినగంజాం మండలం వెళ్లడంతో ఖాళీ అయిన స్థానంలో ఈయన వచ్చి చేరారు.



పర్చూరు ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన మాల్యాద్రి

రూ. 36.50 లక్షలు పలికిన చెరువు వేలం

సంతమాగులూరు (అద్దంకి రూరల్): మండలంలోని వెల్లలచెరువు గ్రామంలోని ఊరచెరువు చేపల చెరువు వేలంపాటి మంగళవారం సర్పంచ్ షేక్ సైదాబీ, గ్రామ పెద్దల సమక్షంలో నిర్వహించారు. గ్రామానికి చెందిన అడుసుమల్లి శ్రీరామమూర్తి రూ. 36,50,000 కు పాడి రెండు సంవత్సరాలకు హక్కు పొందారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ కంచేటి భాస్కర్, ఈవోఆర్డీ శివరామకృష్ణ ప్రసాద్, సెక్రటరీ పూర్ణచంద్, ఆలూరి శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



వేలం పాటలో పాల్గొన్న గ్రామపెద్దలు, పాటదారులు

ఉన్నత పాఠశాలకు మైక్ సెట్ వితరణ

చినగంజాం: మండలంలోని పెదగంజాం జెడ్పీ ఉన్నత పాఠశాలకు దాత ఇండేన్ గ్యాస్ కంపెనీ చినగంజాం శాఖ యజమాని ముప్వల శ్రీనివాసరావు అందజేశారు. బుధవారం సుమారు రూ. 18 వేలు విలువ కలిగిన మైక్‌ను పాఠశాల హెచ్ఎం ఎం. దేవదత్తంకు అందజేశారు. గతంలో శ్రీనివాసరావు పాఠశాలకు వాటర్ కూలర్ ఫ్రిజ్, అనేక సార్లు విద్యార్థులకు బహుమతులు అందజేసినట్లు హెచ్ఎం తెలిపారు. దాత ముప్వల శ్రీనివాసరావుకు శాలువా కప్పి సత్కరించారు.



దాత శ్రీనివాసరావును సత్కరిస్తున్న పాఠశాల సిబ్బంది

దోమలతో రోగాల వ్యాప్తి

ఇంకొల్లు (చినగంజాం): దోమలు వ్యాప్తి చెందడమే రోగాలన్నింటికీ ప్రధాన కారణం అని ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ అంజలి, డాక్టర్ భాను ప్రకాష్ అన్నారు. వంకాయలపాడులో ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. 41 మందికి చికిత్స అందజేశారు. లార్వాల నిర్మూలకు ఎబేట్ పిచికారీ చేశారు.



దోమల నివారణ మందు స్ప్రే చేస్తున్న పంచాయతీ సిబ్బంది

అద్దంకిలో ఫీవర్ సర్వే

అద్దంకి రూరల్: అద్దంకి గాజులపాలెం సచివాలయం పరిధిలోని గుర్రాల కాలనీలో మంగళవారం వైద్యాధికారి జయసింహ ఆధ్వర్యంలో ఫీవర్ సర్వే నిర్వహించారు. అనంతరం జ్వరాలు రాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను కాలనీ వాసులకు వివరించారు. శానిటేషన్ సిబ్బంది కాలువల్లో మురుగు తొలగించారు. శానిటేషన్ సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బైక్‌ను వెనుక నుంచి ఢీకొన్న కారు

- వ్యక్తికి తీవ్ర గాయాలు

జె.పంగులూరు: బైక్ పై వెళుతున్న వ్యక్తిని వెనుక వైపు నుంచి వస్తున్న కారు ఢీ కొనడంతో బైకు నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మంగళవారం రాత్రి జాగర్లమూడివారిపాలెం జాతీయ రహదారిపై జరిగింది. అందిన వివరాలు మేరకు.. ఇంకొల్లు మండలం నక్కలపాలెం గ్రామానికి చెందిన మద్దిరాల సురేష్ గుళ్ళపల్లి గ్రోత్ సెంటర్‌లో పని చేస్తుంటాడు. ఎప్పటిలాగే మంగళవారం రాత్రి పని ముగించుకొని బైక్‌పై వెళుతున్నాడు. మండలంలోని జాగర్లమూడివారిపాలెం గ్రామం వద్ద జాతీయ రహదారిపై అదే సమయంలో వెనక నుంచి వేగంగా వస్తున్న కారు బైకును బలంగా ఢీ కొంది. ఈ ప్రమాదంలో సురేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బైక్‌ను ఢీ కొని వెళుతున్న కారును బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద మార్టూరు హైవే మొబైల్ సిబ్బంది సమాచారం మేరకు అదుపులోకి తీసుకున్నారు. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని రేణింగవరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. క్షత గాత్రుడిని అద్దంకి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు సమాచారం. రేణింగవరం ఎస్సై వినోద్‌బాబు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గాయాల పాలైన సురేష్

సభా వేదిక ప్రారంభం

చీరాల: వాడరేవులోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నూతనంగా నిర్మించిన సభా వేదిక, ప్రాంగణాన్ని బుధవారం ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, శ్రీరామానంద సరస్వతి ప్రారంభించారు. టీడీపీ నాయకులు గౌరీ అమర్నాథ్, నాయకులు పాల్గొన్నారు. అలానే పేరాల సొసైటీ బిల్డింగ్ వద్ద రుద్రాక్ష వైభవం ఆధ్యాత్మిక వాస్తు నిలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

చీరాల అర్బన్: వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని రూరల్ సీఐ ఎస్.సత్యనారాయణ అన్నారు. బుధవారం చీరాల రూరల్ కీర్తివారిపాలెం వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు.